




# కరపత్రం

SINCE 2014

సోమవారం ఫిబ్రవరి 17 2025 | సంపుటి :0 | సంచిక : 126 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


## అధికారులు ఏసీ రూములు

# వదలడం లేదు



హైదరాబాద్ డెస్క్:
సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ అధికారుల మీద ఫైర్ అయ్యారు. కొందరు అధికారులు ప్రజాక్షేత్రంలోకి వెళ్ళడానికి ఇష్టపడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు బేగంపేటలోని ఐఏఎస్ ఆఫీసర్స్ ఇన్‌స్టిట్యూట్‌లో "లైఫ్ ఆఫ్ ఏ కర్మ యోగి- ఏ మెమరీ ఆఫ్ సివిల్ సర్వెంట్" అనే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పుస్తకావిష్కరణ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ.. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం.గోపాలకృష్ణ (రచించిన "లైఫ్ ఆఫ్ ఏ కర్మ యోగి" పుస్తకంలో తాను సివిల్ సర్వెంట్ గా ప్రజల కోసం ఏమేం చేశారో.. ఎలాంటి కష్టాలు ఎదుర్కొని, విజయాలు సాధించారో పొందుపరిచారని అన్నారు. ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగి ఈ పుస్తకాన్ని చదివి.. గోపాలకృష్ణ లాగ ప్రజల బాగు కోసం పాటుపడాలని సూచించారు. అధికారులు ప్రజాక్షేత్రంలో ఎంత తిరిగితే అంత మంచిది అని, ప్రజల అవసరాలు ఏంటో స్వయంగా తెలుసుకోవచ్చని అన్నారు.శంకరన్, శేషన్, మన్మోహన్ సింగ్ లాంటి అధికారులను ప్రతిక్షణం అధికారులు గుర్తు చేసుకుంటూ ఉండాలన్నారు. అయితే కొంతమంది అధికారులు ప్రజాక్షేత్రంలోకి వెళ్ళకుండా ఏసీ గదులకు మాత్రమే పరిమితం అవుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎన్ని పథకాలు ప్రవేశ పెట్టినా అవి అధికారుల ద్వారా మాత్రమే ప్రజలకు చేరతాయని, అధికారులు ఏసీ గదులు వదిలి రాకపోతే అవి ఏ విధంగా వారికి అందుతాయని ప్రశ్నించారు. గతంలో ఐఏఎస్ అధికారులు నిత్యం ప్రజల్లో ఉండేవారని.. గతంలో అధికారులు, రాజకీయ నాయకులు అంశాలను ప్రస్తావిస్తే అందులోని లోతుపాతులు, లాభ నష్టాలను వివరించేవారని అన్నారు. కానీ ఈ రోజుల్లో ఎందుకో అది తగ్గిపోయిందన్నారు. అధికారులు నిబద్ధతతో పని చేస్తేనే ప్రజలకు మంచి జరుగుతుందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తెలియ జేశారు.

2లో

- ప్రభుత్వ అధికారులపై నిప్పులు చెరుగుతూ, కొంతమంది అధికారులు ప్రజాక్షేత్రంలోకి వెల్లాలని ఇష్టపడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.
- "లైఫ్ ఆఫ్ ఏ కర్మ యోగి" పుస్తకావిష్కరణలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.
- పుస్తకం రచయిత రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం. గోపాలకృష్ణ విజయాల గురించి మాట్లాడారు.
- ప్రతి ప్రభుత్వ ఉద్యోగి గోపాలకృష్ణ లాగ ప్రజల బాగుకోసం పాటుపడాలని సూచించారు.
- అధికారులు ప్రజాక్షేత్రంలో తిరగడం మంచిదని, ఇలా చేస్తే ప్రజల అవసరాలు స్పష్టంగా తెలుసుకోవచ్చని తెలిపారు.
- నిబద్ధతతో పని చేసిన అధికారులు మాత్రమే ప్రజలకు మంచి చేస్తారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

## కులగణనపై ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు

- కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణనను "డ్రామా" అని విమర్శించారు.
- బీసీ గణనను చట్టబద్దమైన సంస్థలతో సర్వే చేసి అసెంబ్లీ ద్వారా చట్టబద్ధత కల్పించాలని పేర్కొన్నారు.
- బీసీ కుల గణనకు బీజేపీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు.

యాదాద్రి భువనగిరి జిల్లా: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణన ఒక డ్రామా అని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. యాదగిరిగుట్టలో ఆదివారం(ఫిబ్రవరి16) ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు.




## మెట్రో సెకండ్ ఫేజ్‌లో సరికొత్త టెక్నాలజీ..

### మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్లలో కొత్త రూపురేఖలు

- మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్లలో కొత్త రూపురేఖలు.
- బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో భూగర్భ కారిడార్ నిర్మాణం.
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలతో మెట్రో మార్గాల రూపకల్పన ప్రారంభం.
- 23 కిలోమీటర్ల ప్యారడైజ్-మేడ్చల్, 22 కిలోమీటర్ల జేబీఎస్-శామీర్‌పేట్ కారిడార్ల రూపకల్పన పూర్తి. ప్రస్తుత ప్రయాణాల సంఖ్య, భవిష్యత్ ప్రయాణాల అంచనాలు.
- ప్రయాణికుల మార్గాలు, పాదచార ప్రయాణికుల సంఖ్య,




2లో



## పొరుగు రాష్ట్రం మన నీటిని తరలిస్తుంటే రేవంత్ చోద్యం చూస్తున్నారు

హైదరాబాద్ డెస్క్:
తెలంగాణ నీటి ప్రయోజనాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గండి కొడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుండడం దుర్మార్గం అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. కృష్ణా జలాలను ఏపీ అడ్డూ అదుపూ లేకుండా తరలించుకు పోతుంటే సీఎం రేవంత్ రెడ్డి , నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏం చేస్తున్నారు? అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది? అని ప్రశ్నించారు. అదే విధంగా ఏడాది మొత్తంలో 646 టీఎంసీలు తరలిస్తే ఎందుకు నోరు మెదపడం లేదని, తెలంగాణ నీటి ప్రయోజనాలు కాంగ్రెస్ కు పట్టవా? అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు.సాగర్ ఆనకట్ట కేంద్ర బలగాల ఆధీనంలో ఉందని, వారి పర్యవేక్షణలో మాత్రమే నీటిని విడుదల చేసుకోవాల్సి ఉన్నప్పటికీ ఏపీ మాత్రం ఇష్టారాజ్యంగా నీటిని తరలిస్తోందన్నారు.

02

# గురుకులాల్లో వృత్తి విద్యా కోర్సులు ప్రారంభించండి..




హైదరాబాద్, ఫిబ్రవరి 16:
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో వృత్తి విద్యా కోర్సులు ప్రవేశపెట్టాలని, స్టడీ సర్కిళ్లను ఉద్యోగ కల్పన కేంద్రాలుగా మార్చాలని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. 2025-26 బడ్జెట్ ప్రతిపాదనలపై తాజాగా సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. గురుకుల విద్యాలయాల్లో రెసిడెన్షియల్ పద్ధతిలో విద్యార్థులు పూర్తిగా అందుబాటులో ఉంటారు. ఈ నేపథ్యంలో వారందరికీ ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెడితే ప్రయోజనం ఉంటుందని అధికారులకు తెలిపారు.బీసీ స్టడీ సర్కిళ్లలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జాబ్ క్యాలెండర్‌ను అనుసరించి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. డీఎస్సీ, బ్యాంకింగ్ వంటి పరీక్షలపైనా దృష్టి సారించాలని అన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలోని సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల భవనాలకు అవసరైన మరమ్మతులు, కిటికీలు, ప్రధాన ద్వారాలకు దోమతెరల ఏర్పాటుకు నిధులు కేటాయిస్తామని, అలాగే అద్దె భవనాల బకాయిలు కూడా వెంటనే విడుదల చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆర్టీసీ ఆస్తులు, నిర్వహణ, ఆదాయ వనరులపై, ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, వాటికి ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు వంటి తదితర అంశాలపై చర్చించారు.దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి బీ ఆర్క్, బీ ప్లానింగ్ ప్రవేశాలకు నిర్వహించిన జేఈఈ మెయిన్ సెషన్-1 పేపర్ 2ఏ, 2బి ప్రాథమిక కీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వెలువడింది. ఈ మేరకు ఎన్‌టీఏ ప్రకటన విడుదల చేసింది. పరీక్షలకు హాజరైన అభ్యర్థులు ఫిబ్రవరి 15 నుంచి 16వ తేదీ వరకు అభ్యంతరాలను ఆన్‌లైన్ ద్వారా తెలుపవచ్చని అన్నారు. కాగా జేఈఈ మెయిన్ బీఆర్క్/బి ప్లానింగ్ 2025 జనవరి 30వ తేదీన జరిగిన సంగతి తెలిసిందే. తాజాగా జేఈఈ (మెయిన్) తుది ఫలితాలు విడుదలైనాయి. త్వరలోనే జేఈఈ మెయిన్ బీఆర్క్/బి ప్లానింగ్ ఫలితాలు కూడా వెల్లడికానున్నాయి.

2లో



- తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జాబ్ క్యాలెండర్‌ను అనుసరించి శిక్షణ ఇవ్వాలని సూచించారు.
- డీఎస్సీ, బ్యాంకింగ్ వంటి పరీక్షలపై కూడా దృష్టి సారించాలని ఆదేశించారు.
- ఆర్టీసీ ఆస్తులు, నిర్వహణ, ఆదాయ వనరులపై చర్చ.
- ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, వాటికి ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు వంటి అంశాలపై కూడా చర్చించారు.



## దేశంలో ఏ సీఎం కూడా వారానికోసారి ఢిల్లీ వెళ్లరు

- బీఆర్ఎస్ ను గద్దె దించేందుకు ప్రజలకు పదేండ్లు పట్టినప్పటికీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై 12 నెలల్లోనే వ్యతిరేకత ప్రారంభమైందన్నారు.
- కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లో 6 గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పినా, వాటిని చేయలేదని విమర్శించారు.
- గత ప్రభుత్వ హామీలను తప్ప, కొత్త ఉద్యోగాలు ఇవ్వలేదు.
- భూములు అమ్మడం, సొమ్ము చేసుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని ఆరోపించారు.

దేశంలో ఏ సీఎం కూడా వారానికోసారి ఢిల్లీ వెళ్లినట్టు చరిత్రలో లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రేవంత్ రెడ్డి హస్తినలో అటెండెన్స్ వేసుకుంటున్నారని ఆరోపించారు. రాహుల్ డైరెక్షన్ లోనే రేవంత్ ప్రధానిపై విమర్శలు చేస్తున్నారన్నారు.

02

## నిర్మలా సీతారామన్ కు కేటీఆర్ ఘాటు లేఖ



02

# సంపాదకీయం

## నిరుపేదలకు అభయమేదీ?

తమిళ సమాజంలో ఒక సామెత ఉంది: 'ఆకలి దహించివేస్తే మొత్తం పదీ ఎగిరిపోతాయి'. ఇవీ ఆ పది: గౌరవం, వంశం, విద్య, ఔదార్యం, జ్ఞానం, ఉదారత, తపస్సు, సాధన, ధైర్యం, ప్రార్థన.మన ఆధునిక ప్రజాస్వామ్య సమాజంలో ఈ పది మాత్రమే కాదు, ఇంకా ఎన్నో సుగుణాలూ హఠాత్తుగా మాయమైపోతాయి. ఇది సత్యం కాదూ? ఢిల్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలోను, బిహార్ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ప్రవేశపెట్టిన 2025–26 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్‌ను విలోకిస్తే ఆ సత్యం మీకు మరింతగా విశదమవుతుంది.అయితే ప్రభుత్వం ఒక సంవత్సర కాలంలో ఇవ్వగలిగినదంతా, ఎన్నికలలో పాలక పక్షం లబ్ధి పొందగలదనే ఆశాభావంతో, కేవలం కొద్ది మంది వ్యక్తులకు మాత్రమే ఇచ్చిన వార్షిక బడ్జెట్‌ను నేను చాలా చాలా అరుదుగా మాత్రమే చూశాను. గౌరవనీయ ఆర్థిక మంత్రి 2025–26 కేంద్ర బడ్జెట్‌ను కచ్చితంగా ఆ ఆశాభావంతోనే నివేదించారని నిక్కచ్చిగా చెప్పదలుచుకున్నాను.ప్రజలకు పంపిణీ చేసేందుకు రూ.1,00,000 కోట్ల కాసుల కాణాచి తనకు అందుబాటులో ఉందని లేదా తాను కనుగొనవలసి ఉందని ఆర్థిక మంత్రి చెప్పారు. ఆమె ఆ భారీ ధనరాశిని 'కనుగొన్నారు'. ఆ సమస్త నిధులను (143 కోట్ల దేశ జనాభాలో) ఆదాయపు పన్ను చెల్లించే 3.2 కోట్ల మందికి ఇచ్చేందుకు ఆమె నిర్ణయించారు. మధ్యతరగతి కుటుంబీకులు, సంపన్నులు, మహా సంపన్నులు, కుబేర సమానులు ఆ 3.2 కోట్ల మందిలో ఉన్నారనేది ఒక అనావశ్యక వివరణ. తమిళ లోకోక్తిని పది సుగుణాలతో పాటు ఆధునిక పరిపాలనా విలువలు అయిన సమ దృష్టి, సామాజిక న్యాయం, సమంజసమైన పంపకం మొదలైన వాటిని కూడా పూర్తిగా గాలికి వదిలివేశారు.బడ్జెట్ రూపకల్పనలో ఉండగా ప్రభుత్వ వార్షికాదాయం తగ్గుదల ఆర్థిక మంత్రిని వేధించింది. కేంద్ర ప్రభుత్వ మొత్తం వసూళ్లకు సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ అంచనాల కంటే రూ.60,000 కోట్ల మేరకు తక్కువగా ఉంటాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ లెక్కతేల్చింది. మరీ ముఖ్యంగా 2024–25 ఆర్థిక సంవత్సర ద్రవ్యలోటును 'మెరుగుపరచాలని' ఆర్థిక మంత్రి ఆశిస్తే, అందుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ కనీసం రూ. 43,000 కోట్లను కనుగొనవలసి ఉన్నది. వసూళ్లలో తగ్గుదల భర్తీకి, ద్రవ్యలోటు 'మెరుగుదల'కు అవసరమైన నిధులకు మొత్తం రూ.1,00,000 కోట్లను సమకూర్చుకోవలసి ఉన్నది. ఇదిలావుండగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపించాయి. ఓటర్లకు భారీ వితరణ చేయదలుచుకుంటే అందుకు అదనపు నిధులు అవసరమవుతాయి. ఆ 'వితరణ' ఆదాయపు పన్నులో కోత రూపేణా ఉండాలని ప్రభుత్వ అత్యున్నత స్థాయిలో నిర్ణయం తీసుకుని ఉంటారు. పన్ను చెల్లింపుదారులలో ఏ వర్గానికి ఆ లబ్ధి చేకూర్చాలి? డొనాల్డ్ ట్రంప్ మహాశయుడు చెప్పినట్టు ప్రతి ఆదాయపు పన్ను చెల్లింపుదారుడు తగ్గింపు లబ్ధి పొందాలి! ఇంకేం, వార్షికాదాయం రూ.7 లక్షల నుంచి రూ.12 లక్షల దాకా ఉన్న వారందరూ ఆదాయపు పన్ను చెల్లించనవసరం లేకుండా నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి రూ.1,00,000 కోట్ల ఆదాయం తగ్గి పోతుందని ఆర్థిక మంత్రి చెప్పారు.ఈ నిర్ణయాల పర్యవసానంగా 2024–25 ఆర్థిక సంవత్సర వ్యయాలలో కోత పెట్టడం, 2025–26లో ఇతర వర్గాల పౌరులకు అవసరమైన సహాయాన్ని సమకూర్చడాన్ని నిలిపివేయడం అనివార్యమయింది. దీంతో ఉపాధి హామీ లబ్ధిదారులు (పేదలలో నిరుపేదలు), దినసరి కూలీలు, ఆదాయపు పన్ను చెల్లించని వేతన ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికులు, ఎమ్ఎస్ఎమ్ఈలు, గృహిణులు, పెన్షనర్లు, నిరుద్యోగ యువతను పూర్తిగా ఉపేక్షించారు. పెట్టుబడి వ్యయం, రాబడి వ్యయం రెండిటిలోను కోత విధించారు. ఈ నిర్ణయం ఫలితంగా విదేశీ వ్యవహారాలు, మానవ వనరుల అభివృద్ధి, సాంఘిక సంక్షేమం, పట్టణాభివృద్ధి మొదలైన మంత్రిత్వ శాఖలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోను, రాబోయే ఆర్థిక సంవత్సరాలలోను నిధుల కేటాయింపు గణనీయంగా తగ్గిపోనున్నది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ నికర పన్ను వసూళ్లు 2024–25లో వలే 11 శాతం చొప్పున పెరుగుతాయని ఆర్థిక మంత్రి విశ్వసిస్తున్నారు! వాస్తవమేమిటి? పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్) ప్రకారం యువతలో నిరుద్యోగిత 10.2 శాతంగా ఉన్నది. పట్టభద్రుల నిరుద్యోగిత 13 శాతంగా ఉన్నది. ఉపాధి కల్పన పథకాల అమలుకు చేసే వ్యయం ఎనిమిది విధాలుగా నిర్ణయించారు. ఉత్పాదకతతో ముడివడి ఉన్న పెట్టుబడి పథకాలు కూడా ఇందులో ఉన్నాయి. ఉపాధి కల్పన పథకాల అమలుకు అయ్యే వ్యయం రూ.23,318 కోట్లుగా 2024–25 బడ్జెట్‌లో అంచనా వేశారు. సవరించిన అంచనాల ప్రకారం ఆ వ్యయం కేవలం రూ.20,035 కోట్లు మాత్రమే. ఏతవాతా ఉపాధి కల్పనా కార్యక్రమాలు లక్ష్య పరిపూర్తిలో పూర్తిగా విఫలమయ్యాయని చెప్పక తప్పదు.పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం వేతన ఉద్యోగులలో పురుషుల నెలసరి వేతనం గత ఏడు సంవత్సరాలలో రూ.12,665 నుంచి రూ.11,858కి పడిపోయింది. అలాగే స్వయం ఉపాధి కార్మికులలో పురుషుల నెలసరి ఆదాయం కూడా గత ఏడు సంవత్సరాలలో రూ.9,554 నుంచి రూ.8,591కి పడిపోయింది. మహిళా ఉద్యోగుల, కార్మికుల ఆదాయాలు కూడా ఇదే విధంగా తగ్గి పోయాయి. కుటుంబ వినియోగంపై సర్వే ప్రకారం నెలసరి సగటు తలసరి వినియోగం గ్రామీణ ప్రాంతాలలో రూ.4,226 కాగా పట్టణ ప్రాంతాలలో రూ.6,996గా ఉన్నది. ఈ సగటు దేశ జనాభా మొత్తానికి వర్తిస్తుంది. కిందిస్థాయిలో ఉన్న 50 శాతం మంది నెలవారీ తలసరి వినియోగ వ్యయం తక్కువ స్థాయిలో ఉన్నది. జనాభాలో కింది స్థాయిలో ఉన్న 25 శాతం నెలవారీ తలసరి వినియోగం మరింత తక్కువగా ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.నెలవారీ తలసరి వినియోగం రూ.4,000 నుంచి రూ.7,000 దాకా మాత్రమే ఉంటే, నలుగురు సభ్యులు ఉన్న ఒక కుటుంబం సుఖప్రదంగా ఎలా జీవించగలుగుతుంది? ఈ తలసరి వినియోగ వ్యయంలోనే ఆహారం, విద్యుత్తు, విద్య, ఆరోగ్య భద్రత, అద్దె, రవాణా, అప్పుల చెల్లింపు, వినోద విహారాలు, సామాజిక బాధ్యతలు, అత్యవసర వ్యయాలు మొదలైనవి కూడా భాగంగా ఉన్నాయన్న వాస్తవాన్ని మనం విస్మరించ కూడదు.2030 సంవత్సరం దాకా ఏటా 78.5 లక్షల ఉద్యోగాలను వ్యవసాయేతర రంగాలలో సృష్టించవలసిన అవసరమున్నదని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. గత పదేళ్లుగా మన తయారీ రంగం స్థితిగతులు క్షీణించి పోతున్నాయి. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం స్థూల దేశీయోత్పత్తిలో మన తయారీరంగం వాటా 2014లో 15.07 శాతం నుంచి 2023లో 12.93 శాతానికి తగ్గి పోయింది. ప్రపంచ వస్తూత్పత్తుల వాణిజ్యంలో చైనా వాటా 28.8 శాతం కాగా, మన దేశం వాటా కేవలం 2.8 శాతం మాత్రమే! నిరుద్యోగ యువజనులు, దినసరి వేతనకార్మికులు, స్వయం ఉపాధి శ్రామికులు అందరికీ అవసరమైన ఉద్యోగాలను మన తయారీరంగం సృష్టించలేక పోతోంది. ప్రభుత్వం ఘనంగా చెప్పే 'మేడ్ ఇన్ ఇండియా' కూడా లక్ష్య పరిపూర్తిలో విఫలమయింది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ తగినంత వృద్ధిరేటుతో అభివృద్ధి చెందడం లేదు. ప్రభుత్వ విధానాల (ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో ఇవి ప్రతి బింబించాయి) ఫలితంగా చాలా కొద్ది మంది సంపన్నులు, మధ్యతరగతి జనాలు (వీరు మహాఅయితే దేశ జనాభాలో 30 శాతంగా ఉంటారు) మాత్రమే జీవనోల్లాసంతో జీవించగలుగుతున్నారు.

## కులగణనపై ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

'బీసీ గణనను చట్టబద్ధమైన సంస్థలతో సర్వే చేసి అసెంబ్లీలో చట్ట బద్ధత కల్పించాలి. బీసీ కుల గణనకు బీజేపీ వ్యతిరేకం కాదు.కులగణనను పార్లమెంట్‌లో ఆమోదించేందుకు సిద్దంగా ఉన్నాం. 70ఏళ్ళ కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీ సీఎం కూడా లేడు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు. కాంగ్రెస్ అంటేనే స్కామ్‌లు, భూ దందాలు,లంచాలు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డబ్బు సంచులతో ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దల చుట్టూ తిరుగుతున్నాడు.ప్రధాని మోదీపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చిల్లరగా ఉన్నాయి. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో మూడు స్థానాల్లో బీజేపీ గెలుస్తుంది. బీఆర్ఎస్ గతంలో టీచర్లను మోసం చేసి పోటీ చేసే అర్హత కోల్పోయింది'అని ఈటల అన్నారు.

# మెట్రో సెకండ్ ఫేజ్‌లో సరికొత్త టెక్నాలజీ..

## మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్లలో కొత్త రూపురేఖలు

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనలతో హైదరాబాద్ మెట్రో సారథ్యంలో సాంకేతిక నిపుణులు, అధికారులు కొత్త మెట్రో మార్గాలను రూపొందించేందుకు కసరత్తు ప్రారంభించారు. 23 కిలోమీటర్ల ప్యారడైజ్– మేడ్చల్ కారిడార్, 22కిలో మీటర్ల జేబీఎస్– శామీర్‌పేట్ ప్రతిపాదిత కారిడార్ అలైన్‌మెంట్లకు సంబంధించిన కసరత్తు పూర్తి చేశారు. జేబీఎస్ నుండి మేడ్చల్, జేబీఎస్ నుండి శామీర్ పేట్ మెట్రో కారిడార్ లకు డీపీఆర్ ల తయారీకై అవసరమైన వివిధ రకాల సర్వే పనులు జోరుగా సాగుతున్నాయని హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

డీపీఆర్ ల తయారీకి ముఖ్యంగా మూడు రకాలైన అధ్యయనాలు అవసరమని మెట్రో అధికారులు గుర్తించారు. ట్రాఫిక్ సర్వే, భూసామర్థ్య పరీక్షలు (జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్), పర్యావరణ ప్రభావ అధ్యయనం (ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్). ట్రాఫిక్ సర్వేకి సంబంధించిన అధ్యయనంలో ఈ కారిడార్ లలో ప్రస్తుతం జరుగుతున్న రోజు వారీ ప్రయాణాల సంఖ్య, భవిష్యత్‌లో జరగబోయే రోజు వారీ ప్రయాణాల అంచనాలు, జంక్షన్ల వద్ద ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు తీసుకునే మలుపులు, పాదచార ప్రయాణికుల సంఖ్య, వాహన ప్రయాణాలకు పట్టే సమయం, వాహన ప్రయాణాల్లో ఎంత శాతం మెట్రో రైలుకు మారే అవకాశం, వివిధ మెట్రో స్టేషన్లు ఏర్పాటయ్యే ప్రదేశాల ప్రయాణ సాంద్రత వంటి అనేక అంశాలు మెట్రో అధికారులు పరిశీలిస్తున్నారు.

ప్రాజెక్ట్ పర్యావరణ ప్రభావ అధ్యయనంలో ప్రస్తుతం ఈ మార్గాలలో ఉన్న గాలి పరిశుభ్రత, గాలిలో ఉన్న ధూళికణాల శాతం, కాలుష్య కారకాల నిర్ధారణ, శబ్ద కాలుష్యం, నీటి వనరులు, వృక్ష, జంతుజీవాల జీవ వైవిధ్యం, జీవనాధారభ్రుతులపై ప్రాజెక్టు చూపే ప్రభావం వంటి అంశాలు పరిశీలన చేయవలసి ఉంటుందని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

ఇక భూసామర్థ్య పరీక్షల్లో ఈ మార్గాలలో ఉండే వివిధ రకాల మట్టి మరియు రాతి పొరల నమూనాలు, వివిధ నిర్మాణాలకు కావాల్సిన భూ సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. భూగర్భంలో నిక్షిప్తమైన నీటి లెవెల్స్ అంచనాలు, భూకంపాలు ఏర్పడే అవకాశాలు వంటి విషయాలు క్షుణ్ణంగా అధ్యయనం చేసి మెట్రో స్తంభాలు, స్టేషన్లు, ఇతర నిర్మాణాలను ఎంత బలంగా డిజైన్ చేయాలో నిర్ణయిస్తారు. సాధారణంగా ప్రతి అర కిలోమీటర్‌కు ఒక బోర్ హోల్ చొప్పున భూసామర్థ్య పరీక్షల నమూనాలు తీసుకోవడం జరుగుతోంది. ఒక్కొక్క బోర్ హోల్ ను ఏభై నుండి వంద అడుగుల లోతు వరకు డ్రిల్లింగ్ చేసి, ఏ స్థాయిలో భూమి గట్టి తనంగానీ లేదా రాతి పొరలు తగులుతాయో పరిశీలిస్తామని మెట్రో ఎండీ చెప్పారు.

ఇప్పటికే హెచ్ఎండీఏ, జాతీయ రహదారుల సంస్థ వారు కొన్ని భూ సామర్థ్య అధ్యయనాలు చేపట్టడం వల్ల, ఇప్పుడు మెట్రో సంస్థ వారు జేబీఎస్ – మేడ్చల్ మార్గంలో 25 చోట్ల, జేబీఎస్ – శామీర్ పేట్ మార్గంలో 19 చోట్ల ఈ భూసామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని మెట్రో ఎండీ తెలిపారు. వీటిలో మేడ్చల్ మార్గంలో 14 చోట్ల, శామీర్ పేట్ మార్గంలో 11 చోట్ల ఇప్పటికే పరీక్షలు పూర్తయ్యాయని ఈ నెలాఖరులోగా మొత్తం అన్ని జాగాల్లో ఈ పరీక్షలు పూర్తవుతాయని చెప్పారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సాఫీగా ప్రయాణించే విధంగా ఈ మెట్రో కారిడార్లను నిర్మించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఈ అధ్యయనాలు అన్నీ పూర్తి చేసి మార్చి నెలాఖరుకు శంషాబాద్ విమానాశ్రయం – ఫ్యూచర్ సిటీ మార్గంతో సహా ఈ మూడు మెట్రో మార్గాల డీపీఆర్ లను సంపూర్ణ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ అనుమతికి సమర్పిస్తామని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి పొందిన తర్వాత డీపీఆర్ లను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని వెల్లడించారు.

# నిర్మలా సీతారామన్ కు కేటీఆర్ ఘాటు లేఖ

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు కేటీఆర్ కేంద్రమంత్రికి బహిరంగ లేఖ రాశారు. స్వాతంత్రం వచ్చిన నాటినుంచి 14 మంది ప్రధానులు 65 ఏళ్లలో 56 లక్షల కోట్లు అప్పు చేస్తే.. 2014 నుంచి 2024 వరకు కేవలం పదేళ్లలోనే రూ.125 లక్షల కోట్ల అప్పు చేసిన బీజేపీ ప్రభుత్వానికి అప్పులపై మాట్లాడే నైతిక హక్కే లేదని కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణను బలవంతంగా ఆంధ్రలో కలిపిన నాడు కూడా తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రమేనని కేటీఆర్ స్పష్టంచేశారు. 2014లో తెలంగాణ ఏర్పడిన సమయంలోనూ రాష్ట్రానికి దాదాపు 70 వేల కోట్ల వరకు అప్పు ఉన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. అలాగే బీఆర్ఎస్ పదేళ్ల పాలన తరువాత కూడా తెలంగాణను మిగులు బడ్జెట్ రాష్ట్రంగానే కాంగ్రెస్ కు అప్పజెప్పామని కేటీఆర్ తేల్చిచెప్పారు. అసలు అప్పులను, మిగులు బడ్జెట్ తో ముడిపెట్టడం సమంజసం కాదన్నారు.

గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుగా తెచ్చిన ప్రతి పైసాను పెట్టుబడిగా మార్చి తెలంగాణ నేలపై విప్లవాత్మకమైన మార్పు తీసుకువచ్చిన విషయాన్ని యావత్ దేశం చూసిందని గుర్తు చేశారు. సమైక్యరాష్ట్రంలో తీవ్ర విధ్వంసానికి గురైన తెలంగాణ ముఖచిత్రాన్ని, తెలంగాణ ప్రజల బతుకు చిత్రాన్ని సమూలంగా మార్చి దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దిన తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. అప్పులున్నంత మాత్రాన ఒక రాష్ట్రం వెనకబడినట్టుగా చిత్రీకరించే ప్రయత్నం సరైంది కాదని స్పష్టంచేశారు. తెచ్చిన అప్పులను దేనికోసం ఖర్చుపెట్టారనేదే అత్యంత కీలకమైన విషయమన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పదేళ్లలో తెచ్చిన 125 లక్షల కోట్ల అప్పుతో ఏం చేశారో చెప్పే పరిస్థితి లేదని, కానీ తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన అప్పుతో దశాబ్దాలపాటు ఈ నేలను పట్టి పీడించిన తాగు, సాగునీటి కష్టాలను శాశ్వతంగా నిర్మూలించే ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను నిర్మించామని తెలిపారు. వ్యవసాయంతోపాటు పారిశ్రామికరంగాన్ని వెంటాడిన చిమ్మచీకట్లను శాశ్వతంగా పారదోలేందుకు భారీ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి, మరోవైపు రాష్ట్రంలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను ఉపయోగించిన విషయం తెలంగాణ సమాజానికి తెలుసని, వాటి ఫలితాలను రాష్ట్ర ప్రజలు చూస్తున్నారని కేటీఆర్ వెల్లడించారు.

బీఆర్ఎస్ హయాంలో.. ఎఫ్.ఆర్.బీ.ఎం పరిమితికి లోబడి చేసిన అప్పును తప్పుగా చూపించే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కేటిఆర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం లాగా తెచ్చిన అప్పులతో కార్పొరేట్ శక్తుల లక్షల కోట్ల లోన్లు మాఫీ చేయలేదనే విషయాన్ని కేంద్ర మంత్రి గుర్తుపెట్టుకోవాలని కోరారు. పంటల దిగుబడిలో పంజాబ్ నే తలదన్నే స్థాయికి తెలంగాణ ఎదిగిందంటే దానికి ప్రధాన కారణం.. తెచ్చిన అప్పులతో సంపద సృష్టించే బృహత్తర కార్యక్రమాలు చేపట్టడమేనని కుండబద్దలు కొట్టారు. అటు కేంద్ర బడ్జెట్ లో, ఇటు రైల్వే కేటాయింపుల్లో బీజేపీ సవతి ప్రేమ కనబరుస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. అధికారంలోకి రాగానే తెలంగాణలోని ఏడుమండలాలను, లోయర్ సీలేరు విద్యుత్ ప్రాజెక్టును లాక్కొని కొత్తగా ఏర్పడిన రాష్ట్రం గొంతుకోసిన విషయాన్ని పదేళ్లు గడిచినా తెలంగాణ ప్రజలు మరిచిపోలేదని కేటిఆర్ పేర్కొన్నారు. కేంద్రం ఖజానా నింపే తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన వాటాను ఇవ్వాలని, విభజన హక్కులను నెరవేర్చాలని అడిగిన పాపానికి కేంద్ర మంత్రి పియూష్ గోయెల్, తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం దారుణమని కేటీఆర్ మండిపడ్డారు.

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో.. కేంద్ర ప్రభుత్వ ఖజానా నింపే స్థాయికి తెలంగాణను తీర్చిదిద్దినందుకు తెలంగాణకు మీరిచ్చే బహుమానం ఈ అవమానాలేనా అని కేటిఆర్ ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్ లో పసుపు బోర్డుకు ఒక్క పైసా కూడా కేటాయించకుండా, కేవలం మాటలకే పరిమితం కావడం అత్యంత దారుణమన్నారు. బోర్డు చైర్మన్ కు కనీసం కూర్చోవడానికి కార్యాలయం కూడా ఇవ్వకపోవడం, పసుపు బోర్డు పట్ల కేంద్ర ప్రభుత్వానికున్న నిర్లక్ష్యానికి నిదర్శనమని స్పష్టంచేశారు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దుచేసిన ఐటీఐఆర్ ప్రాజెక్టును పునరుద్ధరించాలని పదేళ్లలో పదులసార్లు మొరపెట్టుకున్నా కేంద్రం వినిపించుకోలేదన్నారు . దేశ అత్యున్నత చట్టసభ అయిన పార్లమెంట్ లో ఇచ్చిన హామీలకు దశాబ్దం గడిచినా మోక్షం లేకపోవడం నయవంచన కాదా అని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం సొంత ఖర్చులతో చేపట్టిన మిషన్ భగీరథ ద్వారా వందశాతం ఇళ్లకు మంచినీళ్లిచ్చే రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దితే, దాన్ని కూడా జల్ జీవన్ మిషన్ కింద 38 లక్షల నల్లా కనెక్షన్లు ఇచ్చామని కేంద్రం ఖాతాలో వేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మూతపడ్డ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను తెరిపించి యువతకు ఉపాధి కల్పించాలని పదేపదే విజ్ఞప్తిచేసినా కేంద్రం వినిపించుకోకపోవడం ఆ ప్రాంత ప్రజలపట్ల బీజేపీకి ఉన్న నిర్లక్ష్య వైఖరికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. కేంద్రంలో పదకొండేళ్లుగా అధికారంలో ఉన్నా రాష్ట్రానికి దక్కిందేమీ లేదని, బీజేపీ నుంచి ఎనిమిది మంది ఎంపీలను గెలిపించినా ఎనిమిది పైసలు పైసలు కూడా తీసుకురాలేని అసమర్థతను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. కేవలం గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాటి అప్పులపై బురదజల్లి తప్పించుకోలేరని, బీజేపీ చేసిన తప్పులను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ క్షమించరని కేటిఆర్ తేల్చిచెప్పారు.

## దేశంలో ఏ సీఎం కూడా వారానికోసారి ఢిల్లీ వెళ్లరు

మొదటిపేజీ తరువాయి

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్?లో మాట్లాడిన కిషన్ రెడ్డి.. బీఆర్ఎస్ ను గద్దె దించేందుకు ప్రజలకు పదేండ్లు పట్టింది. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై 12 నెలల్లోనే వ్యతిరేకత స్టార్ట్ అయ్యిందన్నారు. కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లో 6 గ్యారెంటీలు అమలుచేస్తామని చెప్పి చేయలేదన్నారు కిషన్ రెడ్డి. రాష్ట్రంలో గత ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాల భర్తీ తప్ప.. పార్టీ ఇచ్చిన కొత్త ఉద్యోగాలేమి లేవన్నారు. ప్రజా వ్యతిరేకతను మరల్చేందుకు లేని విషయాలను సీఎం మాట్లాడుతున్నారని విమర్శించారు. ఘాటుగా, ఆవేశంగా మాట్లాడితే ప్రజలు ఎక్కువ రోజులు భరించరని సూచించారు. అందినకాడికి అప్పులు చేసి, రాష్ట్రాన్ని దివాళా తీసే పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. భూములు అమ్మడం, సొమ్ము చేసుకోవడమే లక్ష్యంగా రేవంత్ సర్కార్ పనిచేస్తోందని ఆరోపించారు. వనరులు సమకూర్చుకునే అంశంలో ప్రణాళిక లేదు.. ఇచ్చిన హామీలు అమలుచేసేందుకు రోడ్డు మ్యాప్ కూడా లేదని ఎద్దేవా చేశారు. గుడ్డెద్దు చేనులో పడ్డట్లు కాంగ్రెస్ పరిపాలన ఉందని సెటైర్లు వేశారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ కు గడ్డు కాలమే..బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు దొందూ దొందే అని మండిపడ్డారు కిషన్ రెడ్డి.

## పొరుగు రాష్ట్రం మన నీటిని తరలిస్తుంటే రేవంత్ చోద్యం చూస్తున్నారు

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ తాగునీటి అవసరాలకు శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నిలువ ఉంచాల్సిన కోటాను ఏపీ తీసుకెళ్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదన్నారు. శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో మిగులు నిల్వలు లేకున్నా పోతిరెడ్డిపాడు, సాగర్ కుడి కాల్వ ద్వారా ఇప్పటికే ఏపీ నీటిని తరలిస్తూ మొండిగా వ్యవహరిస్తుందని తెలిపారు. ప్రతీ సంవత్సరం ఉమ్మడి ప్రాజెక్టులకు సంబంధించి నీటి వినియోగానికి కేఆర్ఎంబీ పరిధిలోని త్రిమెన్ కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ఈ ఏడాది ఇంతవరకు త్రిమెన్ కమిటీ మీటింగ్ పెట్టలేదుని, అంటే బోర్డు వ్యవహారం ఎంతగా దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం బోర్డుపై ఒత్తిడి చేయడంలో, నీటి తరలింపు చేయకుండా ఏపీని నిలువరించడంలో తద్వారా తెలంగాణ నీటి హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ సర్కారు ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. ఏపీ దూకుడు, తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్య వల్ల ఇప్పటికే నాగార్జున సాగర్, శ్రీశైలం రిజర్వాయర్లు ఖాళీ అయ్యాయని, మరోవైపు వేసవి పూర్తిగా మొదలు కాకమునుపే తెలంగాణ రైతులు నీళ్ళ కోసం రోడ్డెక్కి ధర్నాలు చేసే కాలం వచ్చిందన్నారు. ఏపీ నీటి తరలింపును ఇప్పటికైనా అడ్డుకోకపోతే సాగర్ ఆయకట్టుకు ప్రమాదం ఏర్పడనుందన్నారు. సాగర్ లో నీటిమట్టం పడిపోతే హైదరాబాద్ నగరానికి తాగునీటి సమస్య సైతం ఏర్పడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ఏపీ నీటి దోపిడిని అడ్డుకోవాలని, ఈమేరకు కృష్ణ బోర్డుపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేస్తున్నామని హరీష్ రావు తన ఎక్స్ ఖాతా వేదికగా పోస్ట్ చేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం ఫిబ్రవరి 17 2025

# హైద్రాబాద్ అంటే చార్మినార్
# తెలంగాణ అంటే కేసీఆర్

కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి




**17 ఫిబ్రవరి 2025 రోజున కేసీఆర్ పుట్టినరోజు.**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, టిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధినేత తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆశాజ్యోతి గౌరవ శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారి 70 వ జన్మదిన వేడుకల సందర్భంగా ప్రకృతి పచ్చబడాలనే సంకల్పంతో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వృక్షార్చన లో భాగంగా ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని కార్యక్రమం విజయవంతం చేయాలని బిఆర్ఎస్ నాయకులు నిర్ణయించారు.గౌడవెల్లి గ్రామంలోని సాకేత్ వెంచర్ లో ఉదయం 9 గంటలకు తమ ప్రియతమ యువ నాయకులు ఎంపీ శ్రీ సంతోష్ రావు గారు మరియు మాజీ మంత్రివర్యులు మన మేడ్చల్ శాసనసభ్యులు గౌరవ శ్రీ చామకూర మల్లారెడ్డి గారు, మేడ్చల్ మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు శ్రీ భాస్కర్ యాదవ్ గారు, రాజ బొల్లారం బ్రాహ్మణపల్లి సుదర్శన్.మేడ్చల్ %దీ=ూ% పార్టీ మండల ప్రెసిడెంట్ దయానంద్ యాదవ్ గారు, గౌడవెల్లి శ్రీ అమ్మగారి జగన్ రెడ్డి, మైసిరెడ్డిపల్లి దాత ప్రణీత్. కొనాయిపల్లి గుంటి శేఖర్, గుంటి దీపక్, నూతనకల్ చిన్నోళ్ళ భాస్కర్. డబిల్ పూర్ వీర్లపల్లి రాజా మల్లారెడ్డి,వీర్లపల్లి భాగ్యరెడ్డి, ఎల్లంపేట్ గోప గణేష్, రావల్ కోల్ రాజబోయిన మహేందర్, రాజ బొల్లారం తండా మాలోత్ మాంగ్య నాయక్, పూడూరు బాబు యాదవ్, మునిరాబాద్ చిట్టి మల్ల గణేష్, లింగాపూర్ బైరి సంజీవయ్య, బండ మాదారం సామల ప్రభాకర్ రెడ్డి, రాయిలాపూర్ మెట్టు గోపాల్ రెడ్డి, శ్రీరంగవరం కొర్వి బాలరాజు మొదలగు వారు నిన్న జరిగిన పార్టీ సమావేశంలో పాల్గొని కార్యాచరణ రూపొందించారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజలచే కేసీఆర్ అని పిలిపించుకునే చంద్రశేఖర్ రావు గారు 1954 ఫిబ్రవరి 17 న జన్మించారు. 8 మంది అక్కాచెల్లెళ్లు,ఒక అన్న కలిగిన కేసీఆర్ విద్యార్థి యువజన నాయకుడిగా 70వ దశకంలో తన సామాజిక జీవితాన్ని, రాజకీయ జీవితాన్ని ప్రారంభించాడు.కేసీఆర్ రాజకీయ గురువు శ్రీ మదన్ మోహన్ గారు. 1983 సం.లో కేసీఆర్ తన గురువుపైన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కేవలం 877 ఓట్ల తేడాతో ఓడిపోయాడు.తన రాజకీయ జీవితంలో కేసీఆర్ 14 సార్లు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేసాడు. 12సార్లు గెలిచిన కేసీఆర్ కేవలం రెండు సార్లు మాత్రమే ఓడి పోయాడు.కేసీఆర్ కు ఇద్దరు సంతానం కొడుకు కేటీఆర్, కూతురు కవిత తండ్రిలాగే సమర్థులైన రాజకీయ నేతలు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణను వేరుచెయ్యడానికి ఎన్నోసార్లు ఉద్యమాలు జరిగాయి.ప్రత్యేక తెలంగాణ సాధన తీరని కలగానే మిగులుతున్నదని కేసీఆర్ తనదైన శైలిలో మలి ఉద్యమాన్ని నడిపి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాడు.తెలంగాణ సాధించిన నాయకుడిగా కేసీఆర్ పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని భాస్కర్ యాదవ్ అన్నారు.అన్ని పార్టీలను, అన్ని రకాల ఉద్యమ కారులను ఒకే బాటన నడిపిన వ్యూహ చతురుడు కేసీఆర్ అని జగన్ రెడ్డి అన్నారు.ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని నిలిపిన కేసీఆర్ పుట్టినరోజును, నేడు బిఆర్ఎస్ కార్యకర్తలు ఘనంగా జరుపుకుంటున్నారని దయానంద్ యాదవ్ అన్నారు.హైద్రాబాద్ అనగానే చార్మినార్ జ్ఞాపకం వస్తుంది.అలాగే తెలంగాణ పేరెత్తగానే కేసీఆర్ జ్ఞాపకం వస్తాడని సమావేశంలో పాల్గొన్న నాయకులు కార్యకర్తలు కేసీఆర్ అలుపెరుగని కృషిని కొనియాడారు.

కేసీఆర్ ఆయురారోగ్యాలతో తెలంగాణకు మార్గదర్శనం చెయ్యాలని కోరుతూ కేసీఆర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పచ్చదనం విలాసాల సమతూకం
## అధునాతన నివాసం "శ్రీనివాసము"

కిరణ్ చిట్యాల, కరపత్రం ప్రతినిధి

నిజామాబాద్ శరవేగంగా విస్తరిస్తూ ఉన్న నగరం..నిజామాబాద్ మొదటి నుండి అతిపెద్ద వ్యాపార కేంద్రం. ఉత్తర భారతదేశం నుండి మహారాష్ట్ర ద్వారా తెలంగాణాకు వచ్చే వారికి స్వాగత తోరణం నిజామాబాద్.నిజామాబాద్ - హైద్రాబాద్ రహదారిలోని వినాయక్ నగర్ లో గేటెడ్ కమ్యూనిటీ లే అవుట్ లో నిర్మించబడిన "శ్రీనివాసము" అపార్ట్ మెంట్ 'రెడీ టు ఆక్యుపై' స్థితిలో సిద్ధమైంది. పూర్తి రక్షితమైన పరిసరాలు.ఆనుకొని ఉన్న మున్సిపల్ పార్క్,విశాలమైన రోడ్లు గల "శ్రీనివాసము" అపార్ట్ మెట్ లో పెద్ద సైజ్ ఫ్లాట్స్ తో నిర్మించబడింది. చిన్న సైజ్ ఫ్లాట్స్ భవిష్యత్తులో ఇరుకుగా అనిపిస్తాయి, పిల్లలు పెరిగిన తర్వాత, పిల్లల పెళ్ళీ పేరంటాల తర్వాత ఇబ్బందిగా మారుతున్నదని, ఫ్లాట్ చిన్నగా అనిపిస్తున్నదని చాలా మంది ఇప్పుడు భావిస్తున్నారు.. ఇల్లు మళ్ళీ మళ్ళీ కొనలేమని, బడ్జెట్ కొద్దిగా పెరిగినా పెద్ద సైజ్ ఫ్లాట్ మంచిదని మా కస్టమర్లు భావిస్తున్నారని, అటువంటి వారికి శ్రీనివాసం అపార్ట్ మెట్ చక్కని ఆప్షన్ అని నిజామాబాద్ రియల్ ఎస్టేట్ సంఘం చీఫ్ అడ్వైజర్, మహతి కన్సల్టెంట్స్ ప్రొప్రైటర్ శ్రీ మహతి రమేష్ గారు కరపత్రం తో అన్నారు.

అపార్ట్మెంట్ నిర్మాణం పూర్తి అయ్యేవరకు ఫ్లాట్స్ అమ్మకాలు చేయకూడదని ప్రాజెక్ట్ ప్రమోటర్ శ్రీ జి.సురేష్ గారు మాతో చెప్పారని నిజామాబాద్ ప్రముఖ వ్యాపారి శ్రీ ఆరుగొండ కృష్ణ మూర్తి గారన్నారు. "శ్రీనివాసము" అపార్ట్ మెంట్స్ పూర్తి నాణ్యతతో, అన్ని ఇంజనీరింగ్ స్టాండర్స్ తో నిర్మించారని నిజామాబాద్ కు చెందిన ఇంజనీర్ శ్రీ ఎస్.మురళీధర్ గారు సమావేశంలో మాట్లాడారు.విలువలతో కూడిన వ్యాపారంతో, నిర్మాణ రంగంలో తనదైన ముద్రతో, దృఢమైన నాణ్యమైన నిర్మాణాలు అందిస్తున్న శ్రీ సురేష్ గారికి అభినందనలని హైద్రాబాద్ కు చెందిన శ్రీనిక గ్రూప్ సంస్థల డైరెక్టర్ శ్రీ రణధీర్ గారన్నారు.




నిన్న నిజామాబాద్ లోని తమ అపార్ట్మెంట్ లో జరిగిన గెట్ టుగెదర్ సమావేశంలో ప్రమోటర్ శ్రీ సురేష్ గారు మాట్లాడుతూ, బుకింగ్స్ ప్రారంభించిన నెల రోజులకే 40 శాతం ఫ్లాట్స్ అమ్మకాలు పూర్తయ్యాయని, ఇంకా చాలామంది మా కస్టమర్లు ప్రాజెక్ట్ ను దర్శిస్తున్నారని సురేష్ గారన్నారు.

1811,1812,1856,1866 చ.ఫీట్ల వైశాల్యం కలిగిన వరల్డ్ క్లాస్ ఫ్లాట్స్ అందుబాటు ధరలో మేము నిజామాబాద్ ప్రజలకు అందించామని సురేష్ గారన్నారు.

హైద్రాబాద్ తో పాటు నిజామాబాద్, మెట్టుపల్లిలో ప్రాజెక్టులు కడుతున్నామని శ్రీ సురేష్ గారు సమావేశంలో చెప్పారు.

స్వతహాగా చార్టర్డ్ అకౌంటెంట్ అయిన శ్రీ గడ్డం సురేష్ గారు, తమ గ్రూప్ సంస్థల ద్వారా ఇప్పటికే 25 వెంచర్లు పూర్తిచేసామని అన్నారు.

అపార్ట్ మెంట్లు, విల్లాలు, రెసిడెన్షియల్ ప్లాట్స్, హాలీడే ప్లాట్స్ వెంచర్లు దిగ్విజయంగా పూర్తయ్యాయని అన్నారు.నిర్మాణ రంగంతో పాటు, హైదారాబాద్ తొర్రూరులో కార్పొరేట్ హాస్పిటల్స్, పెట్రోలియం ఉత్పత్తుల డిస్ట్రిబ్యూషన్, ఫైనాన్షియల్ కన్సల్టెంట్స్ రంగంలో పనిచేస్తున్న మా గ్రూప్ సంస్థల కస్టమర్లే మా ప్రచార కర్తలని, మా అమ్మకాలకు ప్రధాన సోర్స్ అని అన్నారు.ఒకరి ద్వారా ఇంకొకరు, మౌత్ టు మౌత్ క్యాన్వాసింగ్ మా వ్యాపార విజయానికి మూలమని అన్నారు.బహుముఖ రంగాల్లో వైవిధ్య భరితమైన మా వ్యాపార యాత్రలో సహకారమందిస్తున్న కస్టమర్లకు, స్నేహితులకు, ఏజెంట్లకు, శ్రేయోభి లాషులకు శ్రీ సురేష్ గారు కృతజ్ఞతలు తెలియజేసారు.

## మూడేళ్లలో 30వేల మందికి ఉద్యోగాలు...

**తెలంగాణ యువత కోసం మంత్రి శ్రీధర్ బాబు చొరవ**
**'బీఎఫ్ఎస్ఐ - స్కిల్లింగ్' పేరిట ప్రత్యేక కోర్సు**
**ఏటా 10వేల మంది బీటెక్, డిగ్రీ పట్టభద్రులకు శిక్ష**

**హైదరాబాద్ ఫిబ్రవరి 16 కరపత్రం**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా బీటెక్ పట్టభద్రులకు ప్రారంభించిన 'బీఎఫ్ఎస్ఐ - స్కిల్లింగ్' కోర్సుకు విశేష స్పందన లభిస్తోంది. ఆదివారం నిర్వహ అర్హత పరీక్ష జరిగింది . వీరిలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈ ఏడాది జూలై వరకు బ్యాంకింగ్ ఆపరేషన్స్, ఫైనాన్షియల్ మార్కెట్స్, ఇన్సూరెన్స్, ఇన్వెస్ట్ మెంట్ బ్యాంకింగ్, సాఫ్ట్ వేర్, ప్రోగ్రామింగ్, అప్లికేషన్ అండ్ డేటాబేస్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, సాఫ్ట్ స్కిల్స్ తదితర అంశాలపై యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ (yisu.in) లో శిక్షణ ఇస్తారు. అనంతరం బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ)కు సంబంధించిన హైదరాబాద్ లోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ)లో ప్లేస్ మెంట్స్ కల్పిస్తారు. పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య నెలకొన్న అంతరాన్ని తగ్గించి, తెలంగాణను నైపుణ్యం కలిగిన మానవ వనరులకు చిరునామాగా మార్చాలని సీఎం రేవంత్ రెడ్డి సంకల్పించారు. అందులో భాగంగానే స్కిల్ యూనివర్సిటీకి శ్రీకారం చుట్టారు. పరిశ్రమల అవసరాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ.. అందుకు అనుగుణంగా కొత్త కోర్సులను తెలంగాణ యువతకు అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. అనుకూలమైన వాతావరణం ఉండటంతో హైదరాబాద్ లో జీసీసీలను ప్రారంభించేందుకు దిగ్గజ సంస్థలు ముందుకొస్తున్నాయి. ముఖ్యంగా బీఎఫ్ఎస్ఐ రంగంలో ఏర్పాటవుతున్న జీసీసీల సంఖ్య పెరుగుతోంది. వీటిల్లో తెలంగాణ యువతకు ఉద్యోగాలు దక్కేలా ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇప్పించాలని మంత్రి శ్రీధర్ బాబు సంకల్పించారు. బీఎఫ్ఎస్ఐ రంగంలో అనుభవమున్న దేశీయ, యూఎస్ఏ, సింగపూర్ నిపుణులు, జీసీసీల నిర్వాహకులను సంప్రదించారు. వారి సూచనలు సలహాలతో 'బీఎఫ్ఎస్ఐ %-% స్కిల్లింగ్' పేరిట ప్రత్యేక కోర్సును స్కిల్ యూనివర్సిటీలో అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా ఏటా 10వేల మందికి శిక్షణ ఇస్తారు. వీరిలో 5వేల మంది ఇంజినీరింగ్, మరో 5వేల మంది డిగ్రీ పట్టభద్రులుంటారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అనంతరం బీఎఫ్ఎస్ఐ జీసీసీల్లో ఉద్యోగాలు ఇస్తారు. అంటే.. రానున్న మూడేళ్లలో 30వేల మంది తెలంగాణ యువతకు ఈ కోర్సు ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. గతేడాది సెప్టెంబర్ లో మొదటి బ్యాచ్ ప్రారంభమయ్యింది. దీని నిర్వహణకయ్యే ఖర్చును ఎక్విప్(equipp), బీఎఫ్ఎస్ఐ కన్సార్షియం భరిస్తుంది. విద్యార్థులు స్వల్ప అడ్మిషన్ ఫీజు చెల్లిస్తే చాలు . సర్టిఫికేట్, ఇతర అడ్మినిస్ట్రేటివ్ అవసరాల కోసం అభ్యర్థుల నుంచి ఒక్కసారి రూ.5వేలు వసూలు చేస్తారు. ఇప్పటికే రెండు బ్యాచ్ లను విజయవంతంగా పూర్తి చేసినట్లు కోర్సు నిర్వాహకులు తెలిపారు.

## రక్తం కళ్ళ జూసిన రక్త సంబంధం

కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి

- **నిన్న మధ్యాహ్నం మేడ్చల్ లో పట్టపగలు నడి రోడ్డుపై హత్య జరిగింది**
- **చంపింది తమ్ముడు, చనిపోయింది అన్న**
- **మమతలు మాయమై ప్రభలిన హింసా ద్వేషం**
- **హత్య జరుగుతుంటే సెల్ ఫోన్ లో షూట్ చేస్తున్న మానవత్వం మరచిన జీవులు**
- **ఒక్క కేక వేసినా హంతకులు భయపడేవారేమో**

**ఇక వార్తలోకి వస్తే..**

మేడ్చల్ పట్టణంలోని బస్ డిపో ఎదుట 44వ నెంబర్ జాతీయ రహదారిపై దారుణ హత్య. మేడ్చల్ బస్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్ గా పనిచేస్తున్న గన్యా కుమారుడు 30 సం.ల వయస్సు గల ఉమేష్ ను, ఆయన చిన్న కుమారుడు మరో వ్యక్తితో కలిసి కత్తితో పొడిచి చంపాడు.

కుటుంబ కలహాల కారణంగా ఈ దారుణానికి ఒడిగట్టినట్టు సమాచారం. మద్యానికి బానిసై కుటుంబ సభ్యులపై వేధింపులకు పాల్పడుతుండడంపై విసిగిపోయిన చిన్న కుమారుడు హత్యకు పూనుకున్నట్టు తెలిసిన విషయం.మేడ్చల్ సీఐ సత్యనారాయణ, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. గన్యా స్వగ్రామం కామారెడ్డి జిల్లా మాచారెడ్డి. మేడ్చల్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్ గా పనిచేస్తున్న కారణంగా కుటుంబంతో సహా మేడ్చల్ కు వచ్చి, బతుకుతున్నాడు. ఆయనకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. హత్యకు గురైన వ్యక్తి సంతానంలో రెండవ వాడు కాగా, హత్య చేసింది చిన్న కుమారుడని తెలిసింది.

**స్థూలంగా వార్త ఇంతే..**
**ఈ దారుణాలు, ఘోరాలు నిత్యం నిరంతరం జరుగుతూనే ఉన్నాయి.**
**జనం చూస్తున్నారు, వింటున్నారు,మరచిపోతున్నారు.**
**ఇవన్నీ మరచిపోవడానికి "మందు" ఉందిగా..**
**తాగుదాం .. మరచిపోదాం.**

మద్యానికి బానిస అయిన ఉమేష్ లోకం మరచిపోతే, తమ్ముడు బంధం మరచిపోయాడు.

తప్పు ఎవరిది? అని మనం చర్చించుకోవడం కాదు.కారణమేమిటి? అని ఆలోచించాలి.

"మద్యం తాగడం ఆరోగ్యానికి హానికరం" అని మందు సీసా లేబుల్ పై చిన్నగా ముద్రించి చేతులు దులుపుకుంటూ ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయి.




**ఇదింతేనా!**

రాజకీయ పార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే ఉచిత పథకాలు నడపాలి. ఆ పథకాలకు కావాల్సిన డబ్బులు ఇలా మద్యం వ్యాపారంతో సంపాదించాలి.

మద్యం తామస వస్తువు. ఆలోచనను విచక్షణను మద్యం చంపేస్తుంది.ఆరోగ్యానికి హానికరమైన మద్యాన్ని ప్రభుత్వాలు ఎందుకు అందుబాటులో ఉంచాలి.ఉచితాల కొరకేనా! మనుషులకంటే ఏదీ ఎక్కువ కాదు.మనుషులను మనుషులుగా మార్చలేని పాలన అభిలషనీయం కాదు.తాగడం తాగిపించడం ఒక ఫ్యాషన్ గా జనం మార్చుకున్నారు.ప్రభుత్వం సమాజాన్ని ఇలా మార్చింది.విచ్చలవిడిగా మందు అమ్మకం చేయించి వచ్చిన ఆదాయంతో ప్రభుత్వం నడపాలి. ఇంకా ఇతర మార్గాల్లో పన్నులు టాక్స్ లు భాది డబ్బు పిండాలి.

**ఇంతేనా రాజకీయం!**

భాధ్యత లేని ప్రభుత్వాలు ప్రజల నడవడికను ఎలా దారిలో పెట్టాలని ఆలోచించడం మానేశాయి.తప్పు జరిగినా,నేరం జరిగినా పోలీసులు కేసులు పెడతారు,అరెస్టులు చేస్తారు, జైలుకు పంపుతారు.అక్కడితో చట్టం నిర్దేశించిన, కల్పించిన విధులను పూర్తి చేసి ప్రెస్ మీట్ లో విషయం ప్రకటించి పోలీసులు పక్కకు తప్పుకుంటారు.ఈ అరాచకాలను,అకృత్యాలను, అసాంఘీక కార్యకలాపాలను ఆపే భాధ్యత ఎవరిది? సమాజం నడకను కనిపెడుతూ ఎప్పటికప్పుడు సరిచేస్తూ, సంస్కరిస్తూ నైతికతను కాపాడాల్సిన కర్తవ్యం ప్రభుత్వ అధినేతలది.ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాల్సిన భాధ్యత ప్రభుత్వ అధికారులది. సమయం పూర్తయ్యే వరకు డ్యూటీ చేసి ఇంటికి పోవడం మాత్రమే తమ అని ప్రతి ప్రభుత్వ ఉద్యోగి భావిస్తున్నాడు.రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు సమాజం లోని అన్ని కోణాలను గమనిస్తూ ఉండాలి.ఇది మా డిపార్ట్ మెంట్ పని కాదు అనుకోకుండా, తాము గమనిస్తున్న సంఘ విరోధ వ్యక్తులను,విషయాలను ఎప్పటికప్పుడు సంబంధిత ఉన్నత అధికారుల దృష్టికి తెచ్చి అప్రమత్తం చెయ్యాలి.జిల్లా కలెక్టర్లకు అన్ని శాఖలపై ఆధిపత్యం ఉంటుంది.జిల్లాలో ప్రతి చిన్న విషయం నిషితంగా గమనించేటట్టు అందరు ఉద్యోగులను పురికొల్పాలి.సామాజిక కార్యకర్తలతో ప్రతి గల్లి విషయాలు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయం చేసుకొనే వ్యవస్థ మనం నిర్మించుకోవాలి.లేకపోతే సమాజం నిర్వీర్యమై, నిశ్చేష్టమై పోతుంది.మనచుట్టూ ఎన్నో అవాంచనీయ సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి.మన నిష్క్రియాపరత్వం అశాంతికి కారణమవుతుంది. మేడ్చల్ లో హైవేపై పట్టపగలు హత్య దీనికి ఉదాహరణ కాదా?ఇది అన్నదమ్ముల గొడవ కాదు.ప్రభుత్వాల భాధ్యత రాహిత్య పాలనకు సాక్ష్యం.ఈ హత్యలు లేని, అరాచకాలు లేని సమాజం కావాలి.మానవత్వాన్ని చంపేస్తున్న వ్యక్తులను గుర్తించాలి. నాయకులు,రాజకీయపార్టీలు,ఉద్యోగులు చివరికి ప్రభుత్వాలు, సామాజిక కార్యకర్తలు అందరూ ప్రజల నైతిక ప్రవర్తన పట్ల ఫోకస్ చెయ్యాల్సిందే.లేకపోతే .. ఈ అరాచకాలను సెల్ ఫోన్లో రికార్డు చేసే యాంత్రిక మనుషుల సమూహంగా మారి సమాజం లుప్తమవుతుంది. అంటే నశించి పోతుంది.

## రాజేశ్వరరావు పేట పం హౌస్ వద్దఘనంగా కేసీఆర్ ముందస్తు జన్మదిన వేడుకలు..



**కరపత్రం మెట్ పల్లి, ఫిబ్రవరి 16.**
మెట్ పల్లి మండలంలోని రాజేశ్వరరావు పేట గ్రామంలో గల పంప్ హౌస్ వద్ద నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని 10 సంవత్సరాల అద్భుతంగా తీర్చిదిద్దిన గౌరవ తెలంగాణ రాష్ట్రతొలిముఖ్యమంత్రివర్యులు కేసీఆర్ జన్మదిన వేడుకలు ముందస్తుగారాజేశ్వరరావుపేట పుంపు హౌస్ వద్ద ఆదివారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ గారు కాలేశ్వరం ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారని గ్రూప్లో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కొనియాడా రైతుల ఆత్మహత్యలకు కేంద్ర బిందువు ఉన్న తెలంగాణను రైతుల ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దారని తెలిపారు. రైతుల కుటుంబాలలో వెలుగు నింపారని రాష్ట్ర తలసరి ఆదాయాన్ని దేశంలోని తెలంగాణ మొదటి స్థానంలో నిలిపిన ఘనత కేసిఆర్ దని పేర్కొన్నారు.రైతు బంధు పథకం కెసిఆర్ ప్రవేశపెట్టారనికల్వకుంట్ల సంజయ్ అన్నారు.తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందు ఉంచారని ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో నియోజవర్గ బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ,పాల్గొన్నారు..

## యామాపూర్ లోఅలేటి రక్షిత్‌ను అభినందించిన మెట్టుపల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్.

**కరపత్రం ప్రతినిధి, మెట్ పల్లి, ఫిబ్రవరి 16.**
జగిత్యాల జిల్లా మెట్పల్లి సర్కిల్ పరిధిలోని ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ గ్రామానికి చెందిన అలేటి రక్షిత్ నా జేఈఈ మేన్స్‌లో 98.08% 164/300 స్కోర్ సాధించి గొప్ప విజయాన్ని అందుకున్నారని ఆదివారం మెట్పల్లి సిఐ అభినందించారు. ఈ సందర్భంగా మెట్పల్లి సీఐ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్,




నిజాంపేటలోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలో విద్యాభ్యాసం చేస్తున్న రక్షిత్ తన కష్టపడే స్వభావం, పట్టుదలతో తన కుటుంబానికి, గ్రామానికి, మొత్తం ఇబ్రాహీంపట్నం మండలానికి గర్వకారణంగా నిలిచాడని సీఐనిరంజన్ రెడ్డి అన్నారు.మెట్పల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి వ్యక్తిగతంగా రక్షిత్‌ను అభినందిస్తూ, మరింత విజయాలను సాధించేందుకు పురోగమించాలని ప్రోత్సహించారు. గ్రామ యువత రక్షిత్‌ను ఆదర్శంగా తీసుకొని విద్య, భవిష్యత్ నిర్మాణంపై దృష్టి పెట్టాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు.రక్షిత్ విజయం నిరూపించేది ఏంటంటే, పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధ్యమే. గ్రామ యువత అందరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండి, తమ భవిష్యత్తును విద్య ద్వారా తీర్చిదిద్దుకోవాలిఅని సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి అన్నారు.రక్షిత్ భవిష్యత్ కార్యాచరణకు పోలీసులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, గ్రామం నుండి మరింత మంది విద్యార్థులు అతడి మార్గంలో ముందుకు వెళ్లాలని సీఐ నిరంజన్ రెడ్డి అన్నారు .

## మాలపోచమ్మకు చలి బోనాలు



**కరపత్రం ప్రతినిది..నిజాంపేట్**
నిజాంపేట మండల కేంద్రంగా ఆదివారం రోజున మాల సంఘం మహిళలు మాల పోచమ్మ దేవతకు చలి బోనాలు సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరము శివరాత్రి పండగ కు వారం రోజుల ముందు చలి బోనం వండి మహిళలందరూ బోనాలు ఎత్తుకొని పోచమ్మ గుడి వద్దకు వెళ్లి గుడిలోని దేవతకు నైవేద్యంగా సమర్పిస్తామని వారు తెలిపారు. అనంతరం కళు సాకలు కొబ్బరికాయలతో మొక్కులు చెల్లించుకుని తిరుగు మళ్లీ బోనాలు ఇళ్లల్లోకి చేరుస్తారు.

## నాయబ్ తాహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించిన రమ్యశ్రీ...



నిజాంపేట మండల తాహసిల్దార్ కార్యాలయ నాయబ్ తాహసిల్దారుగా రమ్య శ్రీ పదవి బాధ్యతలను శనివారం స్వీకరించారు. గతంలో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు లో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహించి పదోన్నతి లో బదిలీపై నిజాంపేట మండలానికి వచ్చారు. మండల ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

# జాతికోసం జీవితాన్నే త్యాగం చేసిన మహామనిషి సేవాలాల్

**– ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**కరపత్రం ధర్మారం ఫిబ్రవరి 16:**
జాతి కోసం జీవితాన్నే త్యాగం చేసిన మహామనిషి శ్రీశ్రీ సంతులాల్ మహారాజ్ అని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కొనియాడారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బంజరుపల్లె గ్రామంలో శ్రీశ్రీ సంతులాల్ మహారాజ్ జయంతి వేడుకలు మార్కెట్ చైర్మన్ లావుడ్యా రూప్లా నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ యొక్క జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సేవలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి బంజారా సంప్రదాయం ప్రకారం బోగ్ బండర్ సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.బంజరుపల్లె ప్రజలు బంజారా పాటలతో మహిళలు నృత్యాలు చేశారు. గిరిజనుల



ఆరాధ్యదైవం సేవలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా గిరిజన సోదరి, సోదరిమనులకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సేవాలాల్ జయంతి సందర్భంగా సెలవును ప్రకటించి వారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి అట్టి వేడుకల్లో పాల్గొనడం అభినందనీయమని వారన్నారు. గిరిజనుల పండుగ అంటే మన అందరి పండగ అని ఈ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సేవాలాల్ మహారాజ్ దేవాలయం నిర్మాణం పూర్తి చేయడంలో నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. సేవాలాల్ మహారాజ్ జాతి కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహా మనిషి అని కొనియాడారు. అలాంటి వ్యక్తి జయంతిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అభిప్రాయపడ్డారు. ఈ జయంతి వేడుకల్లో మార్కెట్ చైర్మన్ లావుడ్యా రూప్లా నాయక్,మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్..

**కరపత్రం రామగుండం ఫిబ్రవరి, 16:**
పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం టిటిఎస్ అంతర్గం మండల కేంద్రంలో ని గ్రౌండ్లో ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామగుండం నియోజకవర్గం స్థాయి క్రికెట్ టోర్నమెంట్స్ నిర్వహించడం జరిగింది. దానిలో భాగంగానే టోర్నమెంట్స్ ముగించడంతో తుది పోరులో ప్రథమ బహుమతి విలేజ్ అంతర్గం టీం, ద్వితీయ బహుమతి రామగుండం రైల్వే స్టేషన్ టీం గెలుపొందడం జరిగింది. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చినటువంటి రామగుండం ఎమ్మెల్యే రాజు ఠాగూర్ బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. అనంతరం అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ నూతనంగా ప్రవేశపెట్టిన సేవా కార్యక్రమంలో నిరుపేద




మహిళల వివాహానికి పుస్తెలు మట్టెలు కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ లో గల లంబాడి తండాలోని ఇస్లావత్ కళావతి కూతురు నిరుపేద మహిళ వివాహము ఈనెల 23వ తారీఖున ఉండటం వలన వివాహానికి పూస్తే మట్టెలు ట్రస్టు ఆధ్వర్యంలో



పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అబ్దుల్ కలాం ట్రస్ట్ చైర్మన్ రవి నాయక్, ఉపాధ్యక్షులు గరిమిళ్ల సాయికిరణ్, ప్రధాన కార్యదర్శి ఎనగందుల శ్రీకాంత్, ఆర్గనైజర్ సెక్రెటరీ కోళ ప్రణీత్ గౌడ్, కమిటీ సభ్యులు మాడ శ్రీకాంత్ రెడ్డి, యువకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా సేవలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

**– వేడుకలలో పాల్గొన్న మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు**

**కరపత్రం (నిజాంపేట్) 15 ఫిబ్రవరి**
నిజాంపేట మండల కేంద్రంలో శనివారం గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు మండలంలోని ఆరు గ్రామాల తాండ వాసులు మండల కేంద్రం లో బంజారుల నృత్య ప్రదర్శన మధ్య జయంతి ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు హాజరై సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్



చేసి సంబరాలను జరుపుకున్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాజు నాయక్, మంగ్య నాయక్,లౌద్య రామ చందర్ నాయక్, శ్రీనివాస్ నాయక్, దేవేందర్ నాయక్, సూర్యనాయక్,తాజా మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు, సీనియర్ నాయకులు ముత్యం రెడ్డి, అమర సేనా రెడ్డి,మండల అధ్యక్షుడు మారుతి,నసీరుద్దీన్,పంజా మహేందర్, చెరుకు శ్రీనివాస్ రెడ్డి,సుప్రభాత రావు,దేమే యాదగిరి,నాగరాజు, కొమ్మట సత్యనారాయణ, కొమ్మట బాబు,వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, సత్యనారాయణ రెడ్డి,మధుసూదన్ రెడ్డి,ఆకుల బాలయ్య,లింగం గౌడ్,వినోద్ నాయక్,రవి నాయక్,నాగరాజు, గుమ్మల అజయ్,మహేష్, వెంకట్, గిరిజన లంబాడి సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## గాయపడ్డ సింగరేణి కార్మికున్ని పరామర్శించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, జీఎం. లలిత్ కుమార్...

**కరపత్రం రామగుండం ఫిబ్రవరి, 16:**
పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఉదయ్ నగర్ లో నివాసం ఉండే బండోస్ సాయికుమార్ అనే సింగరేణి కార్మికుడు జీడీకే -2ఇంక్లైన్ లో ఓవరమెన్ గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల సింగరేణి సంస్థ తరుపున జరిగిన కబడ్డీ పోటీలో ఆడుతుండగా కాలుకు గాయమై సర్జరీ జరిగి హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చిన విషయం



తెలుసుకున్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, అర్జీ-1 జీఎం లలిత్ కుమార్ లు ఆదివారం సాయికుమార్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామితో పాటు తదితరులు పాలుగోన్నారు.

## డి 8 ఉపకాల్వ మరమ్మత్తు పనులు ప్రారంభం..

**కరపత్రం గన్నేరువరం ఫిబ్రవరి 15**
మండలంలోని మైలారం గ్రామానికి సాగునీరు అందించే డి 8 ఉపకాల్వ మరమత్తు పనులు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు మాజీ సర్పంచ్ దొడ్డ రేణుక మల్లేశం శనివారం ప్రారంభించారు. కాలువ



లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించి, కాల్వ ఎత్తు పల్లాలను సరి చేశారు. సాగునీరు అందక పంటలు ఎండుతున్నాయని రైతులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని పోగా ఆయన తక్షణమే స్పందించి పనులు చేపట్టాలని మాజీ సర్పంచి దొడ్డ రేణుక మల్లేశం కు సూచించడంతో పనులు వేగంగా సాగుతున్నాయి. కాలువ మరమ్మత్తు పనులు చేపట్టడానికి సహకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ దొడ్డ రేణుక మల్లేశం లకు గ్రామ రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇమ్మానియేల్ చర్చిలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

**కరపత్రం బాన్సువాడ ఫిబ్రవరి 16**
బాన్సువాడ పట్టణంలోని ఇమ్మానియేల్ చర్చిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని ముందస్తుగా ఆదివారం చర్చ్ ఫాదర్ రాజేందర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా



నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని సాధించి పదేళ్లు అన్ని వర్గాల సంక్షేమంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మహా నాయకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, నాయకులు సాయిబాబా,రమేష్ యాదవ్, సంజీవ్ యాదవ్ కుమార్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె కాలంలో ఉద్యోగులకు వేతనాలు అందించాలి.. జిల్లా అధ్యక్షుడు

**కరపత్రం కామారెడ్డి ఫిబ్రవరి 16**
సమగ్ర శిక్ష ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 29 రోజుల పాటు చేసిన సమ్మె కాలంలో వేతనాలను వెంటనే విడుదల చేయాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు పుల్గం రాఘవరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భునేకర్ సంతోష్, రామచందర్, లక్షణపతి భాస్కర్ చారి,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.